క్లుప్తంగా

ప్రొటెక్షన్ కౌన్సిల్ యూత్ విభాగానికి సుధీర్ ఎంపిక

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ దుగ్గిరాల మండల యూత్ అధ్యక్షుడిగా దుగ్గిరాల మండలం పెరికల పూడికి చెందిన మేదర వెంకట సుధీర్‌ను నియమిస్తూ ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు నాదెళ్ల సునీల్, కనపాల ప్రభాకరరావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వార్డు సచివాలయాల పరిధిలోని ఇంజినీరింగ్, శానిటేషన్ సెక్రటరీలు అప్రమత్తంగా ఉండాలని బుధవారం ఎంటీఎంసీ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ చేశారు. రాబోయే కొన్ని రోజుల్లో అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున శానిటేషన్, తాగునీరు సరఫరాలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వర్ష ప్రభావం అధికంగా ఉండే ప్రాంతాల్లో తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ ఎప్పటికప్పుడు ఎగ్జిక్యూటివ్ అథారిటీ వారికి తెలియజేయాలని వారు ఆదేశాలు జారీ చేశారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పలుగ్రామాల్లోని ఆలయాల్లో బుధవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని అర్చకులు విశేష పూజలు చేశారు. ఉదయాన్నే గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వార్లకు అర్చకులు వంశీకృష్ణ విశేషపూజలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. సీతారామచంద్రస్వామి ఆలయంలో అర్చకులు రాజేంద్రశర్మ పూజలు చేసి భక్తులకు పేలపిండిని ప్రసాదంగా అందజేశారు. అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి దేవికి అర్చకులు అయ్యన్నశాస్త్రి ఖడ్గమాల పూజ, కుంకుమార్చనలు చేశారు. భక్తులు విశేషంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

తాడికొండలో..



తాడికొండ: తాడికొండపై వేంచేసియున్న కొండమల్లికార్జున స్వామి ఆలయంలో తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు బుధవారం భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఆలయానికి విచ్చేసి పూజల్లో పాల్గొన్నారు. ఆలయంపైకి ఘాట్ రోడ్డు ఏర్పాటు చేయడంతో వాహనాలపై భక్తులు అధిక సంఖ్యలో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

నగరంపాలెం: స్థానిక హౌసింగ్‌బోర్డుకాలనీ షిరిడి సాయినాథ మందిరంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా సాయిబాబా వారికి పంచామృతాలతో అభిషేకం, అర్చన, అలంకార పూజలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి నామం (24 గంటలు) ఏకాహం జరిగింది. బాబాను భక్తులు విశేష సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేయగా, అధ్యక్షులు మామిడి సీతారామయ్య, గౌరవ అధ్యక్షులు మామిడి రామారావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి

నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట సిద్దేశ్వర పీఠ పాలిత ఓంకార క్షేత్ర ప్రాంగణంలో బుధవారం గాయత్రి సంగీత సన్మండలి ఆధ్వర్యంలో సద్గురు శ్రీనారాయణ తీర్థ జయంతి మహోత్సవాలు జరిగాయి. అనంతరం నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటీ కార్యదర్శి ఎన్.నారాయణమూర్తి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. స్థానిక కళాకారులు 20 మంది తమ గాత్రధారులతో నారాయణ తీర్థుల విరచిత తరంగాలను శ్రావ్యంగా ఆలపించారు. సన్మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పి.విజయ, ఎం.వై.శేషరాణి పర్యవేక్షించారు.

రాజకీయ పరిణామాలపై అధ్యయనం

నెహ్రూనగర్: కారంచేడు, చుండూరు ఉద్యమాల స్ఫూర్తితో 4 దశాబ్దాల దళితోద్యమాలు, సామాజిక రాజకీయ పరిణామాలు అనే అంశంపై దేశ వ్యాప్తంగా 2024 జూలై 17 నుంచి 2025 జూలై 17 వరకు అధ్యాయనాలతో పాటు సమీక్షలు నిర్వహించనున్నట్లు డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం కారంచేడు దళిత ఆత్మగౌరవ సభ అరండల్‌పేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పాటు సమీక్షలు నిర్వహించి 2025 ఆగస్టు 6న జాతీయ స్థాయిలో సామాజిక రాజకీయ ఉద్యమ శక్తులతో సమ్మేళనం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పొందుగల ప్రకాష్, బుస్సా రత్నప్రసాద్, ఎం సునీల్ కుమార్, విప్పర్ల విజయ్ భాస్కర్, తురక మంగయ్య, మేడి శామ్యూల్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

చైల్డ్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సిస్టర్ లత

తాడికొండ: మగ పిల్లలతో పాటు ధీటుగా ఆడపిల్లలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలంటే నైపుణ్యాలు పెంపొందించుకుని ముందుకు వెళ్లాలని గుడ్ షెపర్డ్ కాన్వెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు స్వచ్ఛంద సేవాసంస్థ ఇన్‌చార్జి సిస్టర్ లత అన్నారు. తుళ్లూరు మండలం మందడం గ్రామం ఎస్టీ కాలనీలో బాలల పార్లమెంట్, కిశోర బాలికలకు వృత్తి విద్యా, టెక్నికల్ కోర్సులపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిస్టర్ లత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తక్కువ సమయంలో, త్వరగా జీవితంలో స్థిర పడాలంటే ఏ విధమైన కోర్సులు అందుబాటులో ఉన్నాయనే విషయాలను వివరించారు. మంగళగిరి మండల కో ఆర్డినేటర్ నేలటూరి నాగమణి మాట్లాడుతూ ఆడపిల్లలకు నర్సింగ్, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, కంప్యూటర్ షార్ట్ కోర్సులతో శిక్షణ పొందాలని సూచించారు. కమ్యూనిటీ ఆర్గనైజర్ అత్తోట పోతురాజు మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచం అంతా మాట్లాడుకునే వ్యక్తి సునీత విలియమ్స్ కూడా మహిళే అయినా ధైర్యంగా అంతరిక్షంలోకి వెళ్లగలిగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది నాగమణి, విజయలక్ష్మి, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధి

మంగళగిరిలో ఆషాఢం గోరింటాకు

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంలో బుధవారం ఆషాఢం గోరింటాకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు మమత మాట్లాడుతూ ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం మన సంస్కృతి అని, గోరింటాకు పెట్టుకోవడం వలన శరీరంలో వేడి తగ్గి చలవ చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో దుగ్గిరాల మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయి చైతన్య, మహిళలు ధూళిపూడి పావని, రోహిణి, శిరీష, దాసరి జ్యోతి, భాను, సృజన, ధనలక్ష్మి, రజిత, కృష్ణవేణి, శ్రీదేవి, జ్యోతి పాల్గొన్నారు.



ఆషాఢం గోరింటాకు కార్యక్రమంలో మహిళలు

మెడికల్ విద్యార్థినికి ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడుకు చెందిన మెడికల్ విద్యార్థినికి తాడేపల్లి పట్టణ పరిధిలోని రామ్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పలగాని శ్రీనివాసరావు బుధవారం ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవేంద్రపాడుకు చెందిన మెడికల్ విద్యార్థిని మరీదు వర్ష విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతోందని, హాస్టల్, మెస్‌లకు సంబంధించి ఆరు నెలలకు సరిపడా ఆర్థిక సహాయం అవసరమని తెలియడంతో రూ.60 వేలు సాయం చేస్తానని హామీ ఇచ్చానని, అందులో భాగంగా రూ.10 వేలు అందజేశామని తెలిపారు. ఈ సందర్భం గౌడ సంఘం నాయకులు కంచర్ల కాశయ్య, లచ్చి తులసి దాస్‌లు డాక్టర్ పలగాని శ్రీనివాస్‌ను అభినందించారు.



నగదు అందజేస్తున్న డాక్టర్ పలగాని శ్రీనివాస్

పారిశుద్ధ్య పనుల కోసం వీక్లీ యాక్షన్ ప్లాన్ అవసరం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: గుంటూరు ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేందుకు వీక్లీ స్పెషల్ యాక్షన్ ప్లాన్ ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరితో కలసి అధికారులు, సిబ్బంది సమావేశం బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య పనుల అమలులో నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు మెరుగైన పారిశుద్ధ్య సేవలతో పాటు తాగునీటి సరఫరా కూడా సక్రమంగా జరగాలని కోరుకుంటారన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించేటప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని చెప్పారు.

అవుట్ ఫాల్ డ్రైన్స్‌లో పూడికతీత పనులు జరుగుతున్నప్పటికీ అంతర్గత వీధుల్లోని డ్రైన్లలో ఇది జరగడంలేదన్నారు. ఇక నుంచి ప్రతి రోజూ మధ్యాహ్నం గ్యాంగ్ వర్క్ ద్వారా అంతర్గత డ్రైన్ల శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యాంటీ మలేరియా పనులు చేపట్టాలని సూచించారు. కీర్తి చేకూరి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల ప్రకారం వీక్లీ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తామన్నారు. నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ నిర్వహిస్తామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు జీఎంసీ నుంచి వచ్చే వాహనాలకు చెత్త ఇవ్వాలని, రోడ్ల మీద, కాల్వల్లో వేస్తే అపరాధ రుసుం విధిస్తామన్నారు. వీధి కుక్కలకు యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేయిస్తున్నామని, సమస్యల తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని వివరించారు. సమావేశంలో ఎస్ఈ శ్యాం ప్రసాద్, ఎంహెచ్ఓ మధుసూధన్, డీసీపీ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన కీర్తి

రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించాలి

సీపీఎం నేత బాబూరావు డిమాండ్

లక్ష్మీపురం: కొత్తగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వం రాజధాని అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడిపేటలోని పార్టీ కార్యాలయంలో జిల్లా విస్తృత సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి వై.నేతాజీ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ తక్షణం అవసరమైన పరిపాలన భవనాలను నిర్మాణం చేయాలన్నారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు కౌలు ఇస్తూనే కాలపరిమితిని పెంచాలని కోరారు. అసైన్డ్ రైతులకు ప్యాకేజిని పెంచాలని, రైతులకు ఇచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. రాజధాని ప్రాంతంలోని పేదల జీవన ప్రమాణాలను పెంచే విధంగా వారికి ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పేదలకు ఇస్తున్న పెన్షన్లు నెలకు 6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, వెనుబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధుల కోసం కేంద్రంపై పోరాడాలని పిలుపు నిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు, పెదవడ్లపూడి హైలెవల్ చానల్‌ను పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా అన్ని ఇసుక రీచ్‌లను తెరిచి వాటికి దారులు ఏర్పాటు చేయాలని, పేదలకు ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని, కౌలు రైతులకు యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని సమావేశం తీర్మానించినట్లు వెల్లడించారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు ఈమని అప్పారావు, కె.నళినికాంత్, ఎమ్.భావన్నారాయణ, ఎం.రవి సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, జె.వి.రాఘవులు, నాయకులు ఎల్.అరుణ, డి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నేత బాబూరావు

క్యాన్సర్ రోగులకు వీల్‌చైర్స్ వితరణ

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ కేర్ సెంటర్‌లో రోగులకు మంచి వైద్యం అందించడంతో రోగుల సహాయకులు దాతృత్వాన్ని చాటుకుంటున్నారని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం క్యాన్సర్ రోగులకు లెప్రసీ సొసైటీ సభ్యులు రూ.20 వేలు విలువ చే మూడు వీల్ చైర్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ రోగులకు మంచి వైద్యం అందించడం వలన సంతోషంగా వెళ్తున్నారని చెప్పారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారని, అందువల్ల ఆస్పత్రి అభివృద్ధి కోసం వీల్ చైర్స్ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ దుర్గా ప్రసాద్, డాక్టర్ శివరామకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు ఆషా సజని, గంగమ్మ, నాట్కో క్యాన్సర్ సెంటర్ కో–ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్ కుమార్, సొసైటీ కో– ఆర్డినేటర్ మామిడి రాధిక, పి.గోపాలకృష్ణ, వరలక్ష్మి, లలిత సుందరి పాల్గొన్నారు.



వీల్‌చైర్స్ అందజేస్తున్న సభ్యులు

మద్యం బాబులకు కౌన్సెలింగ్



తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో మంగళగిరి రూరల్ పోలీసులు కాజలో బుధవారం విస్తృతంగా పర్యటించి మద్యం బాబులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రూరల్ ఎస్ఐ సిహెచ్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతిరోజు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా ప్రజలు సంచరించని ప్రదేశాలు, పంటపొలాల్లో మద్యం తాగే వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, ఇతర మత్తు పదార్థాలు తాగే వారి గురించి సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు.

సాహితీవేత్త పెద్దేటి యోహానుకు సత్కారం



తాడేపల్లిరూరల్: గుర్రం జాషువా కళాపరిషత్ వ్యవస్థాపకుడు, సాహితీరత్న పెద్దేటి యోహానును వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా షేక్ సుభాని మాట్లాడుతూ ప్రముఖ నాటక రచయిత పెద్దేటి యోహానుకు అంతర్జాతీయ ఐఎస్ఓ గుర్తింపు పొందిన మనం ఫౌండేషన్ సంస్థ హైదరాబాద్, తెలంగాణ సరస్వతి పరిషత్‌లో ప్రముఖ సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా పద్మ ప్రతిభా పురస్కారం అందుకోవడం గర్వకారణమని చెప్పారు. సన్మానించిన వారిలో అక్షయ సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షురాలు ఉన్నం మేరి సుజాత, కాకా వెంకటేశ్వర్లు ఉన్నారు.

సామాన్యుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి

లక్ష్మీపురం: మోదీ ప్రభుత్వం రానున్న బడ్జెట్‌లో సామాన్య పౌరుల సంక్షేమంపై దృష్టి సారించాలని, చిన్న వ్యాపారాలను పెంచేందుకు మరిన్ని ఉద్యోగాలు కల్పించేందుకు తయారీ రంగానికి మరిన్ని నిధులు కేటాయించాలని అర్థశాస్త్ర శాఖాపన్యాసకులు సి.హెచ్.సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కేంద్ర బడ్జెట్‌పై బుధవారం చర్చా గోష్ఠి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తన దృష్టిని కొంత వరకు క్షేత్ర స్థాయి ఆర్థిక సంక్షేమం వైపు మళ్లించటం చాలా అవసరమన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విశ్లేషకులు ఇ.చంద్రయ్య మాట్లాడారు.

రామలింగేశ్వర స్వామికి తొలి ఏకాదశి అభిషేకం

నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని రామలింగేశ్వరస్వామికి అభిషేకార్చనలు, అమ్మవారికి శాకాంబరీ అలంకారం, విశేష పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లోని భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఎంకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు



తాడేపల్లిరూరల్: ఏకలవ్య జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న ఏకలవ్య, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ ఏకాగ్రతతో విలువిద్యను అభ్యసించి ఆ విద్యలో రాణించిన గొప్ప వ్యక్తి ఏకలవ్యుడని అన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఇట్టా భాస్కర్, తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసులతో పాటు ఇట్టా పెంచలయ్య, అద్దంకి మురళి, దొంతిరెడ్డి సాంబిరెడ్డి, ఉయ్యాల కోటేశ్వరరావు, అన్నెం కుసుమ, మాలిక, దుర్గారావు, జనసేన పార్టీ నాయకులు మోకా శేషుబాబు పాల్గొన్నారు.

కేఎల్‌యూ పూర్వవిద్యార్థుల సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయం 1995– 1999 బ్యాచ్ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమ ముఖ్య ఉద్దేశం పూర్వ విద్యార్థులలో స్నేహభావాన్ని పెంపొందించి గత జ్ఞాపకాలను నెమరువేసుకోవడానికి స్ఫూర్తిని పెంచుతాయని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రో వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు, పూర్వ విద్యార్థులు సంబంధాల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.సిహెచ్.కావ్య, ఉద్యోగ కల్పనల డైరెక్టర్ డాక్టర్ ఎం.వెంకటనారాయణ, ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్, సీఎస్ఈ రెగ్యుల్ విభాగాధిపతి డాక్టర్ టి.పవన్ కుమార్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

వైఎస్సార్ సీపీ నేత శివరామిరెడ్డి మృతి



బొమ్ము శివారెడ్డి (ఫైల్)

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బొమ్ము శివరామిరెడ్డి (77) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆత్మకూరులోని ఆయన స్వగృహంలో భౌతిక కాయాన్ని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), పార్టీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి నుంచి బొమ్ము శివరామిరెడ్డి నిబద్ధతతో పనిచేసేవారని, కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో పేదలకు అండగా నిలిచి ఎంతోమందికి ఇళ్ల స్థలాలు మంజూరులో కీలకంగా పనిచేశారని కొనియాడారు. పార్టీ మంగళగిరి పట్టణ, రూరల్ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, మర్రిరెడ్డి శ్రీనివాస రెడ్డి, తాడేపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్య, మంగళగిరి జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, సీనియర్ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఉండ్రు కళ్యాణ్, ఎలీషా, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు చిన్నబోతుల దుర్గారావు, బీసీ సెల్ నాయకులు కిషోర్, భాగ్యలక్ష్మి, సాంబశివరావు, ఫిరోజ్ నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, వేమారెడ్డి

దళిత రాజకీయ చైతన్యం అవసరం

నెహ్రూనగర్: 1985లో కారంచేడు దళితులపై అగ్రకుల భూస్వాముల దమనకాండకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమ ఫలితంగా దళిత ఆత్మగౌరవ పోరాట బావుటా దేశంలో సరికొత్త సామాజిక శక్తిగా మారి నూతన చట్టాలను సాధించి రాజ్యాంగ హక్కులు పొందగలిగామని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్ తెలిపారు. కారంచేడు దళిత అమరవీరుల సంస్మరణ సభ నగరంలోని అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో బుధవారం జరిగింది.

ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావు, బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కో ఆర్డినేటర్ సాదు మాల్యాద్రి, ప్రజా పోరు రాష్ట్ర అధ్యక్షులు పాటిబండ్ల కోటేశ్వరరావు, దళిత మహాసభ రాష్ట్ర నాయకులు కొరబండి బాబురావు, డెమోక్రటిక్ పార్టీ అధినేత టిన్నిస్ రాయ్, చార్వాక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిన్నం డేవిడ్ విలియమ్స్, యానాది హక్కుల పోరాట సంఘం రాష్ట్ర నాయకులు బాపట్ల ఏసుబాబు, ఆర్‌పీఐ అత్వలే పార్టీ రాష్ట్ర నాయకులు విప్పర్ల ముత్తయ్య, భీమ్ భారత్ జిల్లా నాయకులు యానం ఆనంద్, ఆంధ్రప్రదేశ్ రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, మాల మహానాడు రాష్ట్ర నాయకులు బత్తుల అనిల్ బాబు, బీఎస్పీ జిల్లా నాయకులు చిరతగుంట్ల వాసు, భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం దితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్

స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో

కారంచేడు ఘటన సమాజానికి మాయని మచ్చ అని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు పేర్కొన్నారు. నగరంలోని సంఘ కార్యాలయంలో కారంచేడు మృతవీరులకు సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మక్కెన ప్రభాకర్, సుబ్బయ్య, అబ్రహం, చంద్రశేఖర్, బాబూరావు, ఎస్‌కే మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కారకులను కఠినంగా శిక్షించాలి

- పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే పోరాటానికి కార్యాచరణ
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ

తెనాలి: చేబ్రోలు గ్రామానికి చెందిన దళిత బాలికపై లైంగిక దాడి దుర్మార్గమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ అన్నారు. తెనాలి రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ రేడియో అండ్ రీడింగ్ రూమ్ ఆవరణలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. బాలికపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసి రోజులు గడుస్తున్నా నిందితుడిని అదుపులోకి తీసుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కేసుపై పోలీసులు నిర్లక్ష్యం వహించ వద్దని కోరారు. కేసును తారుమారు చేసే ప్రయత్నం చేస్తే సహించేది లేదని, ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేస్తామని హెచ్చరించారు. టీడీపీ నేత ఉన్నం రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే శైలజ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం, ఎకరం సాగు భూమిని అందజేయాలని డిమాండ్ చేశారు. వీరితో మోదుకూరి దావీదు, ఉన్నం చిన్న జాను, ఉన్నం అంతోను, ఉన్నం సన్నీ, ఉన్నం ఇమ్మానుయేలు, ఉన్నం గోపి, గొరికపూడి నిఖిల్ ఉన్నారు. తొలుత కారంచేడు మృతవీరులకు నివాళులర్పించారు.



మాట్లాడుతున్న ఉన్నం ధర్మారావు మాదిగ

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వక్తృత్వ, క్విజ్ పోటీలు

లక్ష్మీపురం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు ఆగస్టు 11వ తేదీన నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. స్థానిక బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం పొంది 75 ఏళ్ల గడిచిన సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైజ్ఞానిక స్పృహను పెంచే విధంగా వివిధ రకాల కార్యక్రమాలను జేవీవీ చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు జాన్ బాబు, నాయకులు డాక్టర్ సత్యనారాయణ ప్రసాద్, గోరంట్ల వెంకటరావు, ఎస్ఎం సుభాని, ఉదయ భాస్కర్, శంకర్ సింగ్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

చిన్నబజారులో అన్నదాన కార్యక్రమం

పట్నంబజారు: మొహర్రం పండుగను పురస్కరించుకుని నియోజకవర్గంలోని 12వ డివిజన్ చిన్నబజారులో మసీదు వద్ద న్యాయవాది లియాఖత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు రానున్న రోజుల్లో అంతా మంచి జరగాలని భగవంతుడిని ప్రార్థించామని, నియోజకవర్గ ప్రజలకు మొహర్రం, తొలి ఏకాదశి శుభాకాంక్షలను తెలిపారు. మొహమ్మద్ ప్రవక్త మనుమడు ఇమామ్ హుస్సేన్ బలిదానాన్ని స్మరించుకుంటూ ముస్లిం సోదరులు మొహర్రం పండుగ నిర్వహించడం సాంప్రదాయంగా వస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు సలీం, బాబు, కరీముల్లా, రఫీ, గౌస్, రహంతుల్లా, పెదబాబు పాల్గొన్నారు.